


అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




సంపుటి - 2 సంచిక -328 శుక్రవారం 3 ఏప్రిల్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




# రాజ్యసభలోనూ ఆమోదం

వాకౌట్ చేసిన వైసీపీ

అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ చట్టసవరణ బిల్లు

రాజ్యసభలో చర్చ అనంతరం బిల్లుకు ఆమోదం

ఇప్పటికే లోక్ సభలో బిల్లుకు ఆమోదం



2లో.

## 99 రోజుల ప్రణాళిక

# ఉద్యమంలా సాగాలి

సేవకులుగానే ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నాం

అన్ని రంగాల్లో తెలంగాణను నెంబర్ వన్‌గా నిలపాలన్నదే సంకల్పం

మీ సంపూర్ణ సహకారం కావాలి

: సీఎం రేవంత్‌రెడ్డి సందేశం





**హైదరాబాద్‌ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల ప్రణాళిక సాధారణ కార్యక్రమం కాదుడ ఒక దీక్ష అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అది ఒక ఉద్యమంలా సాగాలని ఆకాంక్షించారు. పాలకులుగా కాకుండా సేవకులుగానే తాము ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని తెలిపారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలపాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని పునరుద్ఘాటించారు. అందుకు మీ సంపూర్ణ సహకారం కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రజలకు సందేశం పంపారు. దాన్ని గ్రామ సభల్లో అధికారులు చదివి వినిపించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన సందేశంలో ఇలాడ. 'ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండేండ్ల మూడునెలలైంది. ఎన్నో ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూడగత పాలకుల తప్పిదాలను సరిచేస్తూడ సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా మన ప్రభుత్వం పని చేస్తోంది. మేం పాలకులం కాదుడసేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర

మిగతా 2లో.

## జ్యుడీషియల్ అధికారుల నిర్బంధంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ..ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) విధుల్లో ఉన్న జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించిన ఘటనపై సుప్రీంకోర్టు గురువారం

మిగతా 2లో.

## తెలంగాణకు కిషన్‌రెడ్డి

# తీరని ద్రోహం

ఏపీకి ఏడు మండలాల అప్పగింత పాపం వారిదే

పునర్విభజన చట్టానికి సవరణ చేసిందే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు

చరిత్రను వక్రీకరించడం దుర్మార్గం : మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్ ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మొదటి నుంచీ ద్రోహం చేస్తున్నారనీ, ఉద్యమ సమయంలోనూ తన పదవికి రాజీనామా చేయకుండా తప్పించుకు తిరిగారని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. పునర్విభజన చట్టానికి సవరణ చేసి ఏపీకి ఏడు మండలాలను అక్రమంగా కట్టబెట్టింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని ఎత్తిచూపారు. పునర్విభజన చట్టంలో ఉంది కాబట్టే ఏపీకి ఏడు మండలాలు అప్పగించాల్సి వచ్చిందని



మిగతా 2లో.

## హర్మూజ్ మార్గం

# పునరుద్ధరణే లక్ష్యం..

35 దేశాలతో భేటీకి భారత్ హాజరు

హర్మూజ్ జలసంధి సంక్షోభంపై యూకే ఆధ్వర్యంలో 35 దేశాల సమావేశం

ఈ కీలక భేటీకి భారత్‌ను ఆహ్వానించిన యునైటెడ్ కింగ్‌డమ్

వర్చువల్ సమావేశానికి హాజరుకానున్న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ



**న్యూఢిల్లీ ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మూసివేసిన హర్మూజ్ జలసంధి సంక్షోభం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన ఈ మార్గాన్ని తిరిగి తెరిపించేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) నడుం బిగించింది. ఇందులో భాగంగా 35 దేశాలతో నిర్వహిస్తున్న అత్యవసర సమావేశానికి భారత్‌ను కూడా ఆహ్వానించింది. గురువారం వర్చువల్‌గా జరిగే ఈ భేటీలో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ పాల్గొంటారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి

మిగతా 2లో.

## తెలంగాణలో 2 లక్షల కొత్త పెన్షన్లు..

రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

చేయూత కింద 2 లక్షల కొత్త పెన్షన్లకు ప్రభుత్వం ఆమోదం

బడ్జెట్‌లో రూ.233 కోట్లు కేటాయించిన రేవంత్ సర్కార్

మూడేళ్లుగా పేరుకుపోయిన 12 లక్షలకు పైగా దరఖాస్తులు



2లో.

## గ్రామీణాభివృద్ధికి కేంద్రం పెద్దపీట

పంచాయితీ నిధుల విడుదలే సాక్ష్యం

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2025-26 సంవత్సరానికి

మిగతా 2లో.

## శాశ్వత పరిష్కారం

# కోసమే భూభారతి

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

-ఆమనగల్‌లో సమీకృత భూభారతి పోర్టల్ ప్రారంభం



2లో.

## 2047 నాటికి రాష్ట్రాన్ని నం.1 చేస్తాం : సీఎస్



2లో.

# 99 రోజుల ప్రణాళిక ఉద్యమంలా సాగాలి

**మొదటిపేజీ తరువాయి**

బిందువుగా నిత్యం శ్రమిస్తున్నాం.

ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుంటున్నాం. ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు మీ ఆమోదం, మద్దతు ప్రకటించారు. మీరు ఇచ్చిన ఈ ఫలితాలు మా బాధ్యతను మరింత పెంచాయి. ప్రభుత్వ పథకాలు అంటే కాగితాలపై కాదుడప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నది మా సంకల్పం. ఆ ఉద్దేశంతోనే 'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించాం. మార్చి 6 నుంచి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగాలి. ఊరూ వాడా సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలి. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి.

మహాలక్ష్మి పథకం, ఉచిత బస్సు సౌకర్యం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలి. 'తెలంగాణ రైజింగ్- 20472 విజన్‌తో ఆర్థికంగానే కాక, అన్నీ రంగాల్లో తెలంగాణను



ప్రపంచంలో నెంబర్ వన్‌గా నిలపాలన్నది మన సంకల్పం. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. క్యూర్, ప్యూర్, రేర్‌గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నాం. వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా మనం ఎదగాలి. ఈ 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు. ఒక దీక్ష. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై, దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి. మీ అందరి సహకారం కావాలి' అని ప్రజలను కోరారు.

## ఫ్యూచర్ సిటీలో పనులు పరిశీలించిన సిఎం రేవంత్

: కేరళలో ఎన్నికల ప్రచారం ముగించుకుని వచ్చిన సిఎం రేవంత్ రెడ్డి, ఫ్యూచర్ సిటీపై దృష్టి సారించారు. గరువారం అధికారులతో కలసి ఆయన ఫ్యూచర్ సిటీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఫ్యూచర్ సిటీలో ఎఫ్‌సిడిఎ కార్యాలయం, స్కిల్స్ యూనివర్సిటీ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సిఎం వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. కె. రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.

# రాజ్యసభలోనూ ఆమోదం

**న్యూఢిల్లీ ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో ఈ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదముద్ర ప్రక్రియ ముగిసింది. అనంతరం ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతికి పంపనుంది. ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేసిన తరువాత గెజిట్ నోటిఫికేషన్ విడుదలకానుంది. గురువారం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రారు బిల్లును ప్రవేశపెట్టనున్నారు. అనంతరం రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ ఈ బిల్లుపై చర్చకు అనుమతి ఇచ్చారు. ఈ చర్చలో 11 పార్టీలు నుంచి 18 మంది సభ్యులు పాల్గొన్నారు. అయితే వైసిపి రాజ్యసభలో కూడా బిల్లును వ్యతిరేకించి సభ నుంచి వాకౌట్ చేసింది.

### నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు: తెలంగాణ బీజేపీ ఎంపీ

దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబునాయుడు కృషి చేశారని, విభజన తర్వాత ఏపీకి అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారని తెలంగాణ బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరమని ఆయన అన్నారు. రాజధాని అమరావతి కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తు చేశారు. భవ్య రాజధాని కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం అవశ్యమన్నారు. రాజధాని అవసరమని, కానీ జగన్ తన హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు.

రాజధాని కోసం చాలాకాలంగా పోరాడిన మహిళలకు, రైతులకు ఆయన శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. అమరావతి బిల్లు కోసం దేశం మొత్తం ఆసక్తిగా చూస్తోందని అన్నారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని నాడు పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్రం ఇచ్చిందని అన్నారు

# శాశ్వత పరిష్కారం కోసమే భూభారతి

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి -ఆమనగల్‌లో సమీకృత భూభారతి పోర్టల్ ప్రారంభం**

**ఆమనగల్,ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** రైతులకు అన్ని విధాలా భద్రత కల్పించే విధంగా గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి స్థానంలో సమీకృత భూ భారతిని అమల్లోకి తెచ్చామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి సమీకృత భూభారతి పోర్టల్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో 99 రోజుల కార్యాచరణతో 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు.

ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ ఉన్న ఆధార్ నంబర్ లాగా భూమి కలిగిన ప్రతి రైతుకూ సర్వేనెంబర్‌తో అనుసంధానం చేస్తూ భూధార్ నెంబర్ కేటాయిస్తామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెవెన్యూ శాఖను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేశామన్నారు. అందుకోసం 10,572



గ్రామాలకు వీఆర్‌ఏలను నియమించినట్టు తెలిపారు. సర్వే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతో రెండు దశల్లో దాదాపు 6వేల మంది లైసెన్సులు కలిగిన సర్వేయర్‌లను నియమించినట్టు చెప్పారు. భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ జరిగే సమయంలోనే అట్టి సర్వే నంబర్‌కు సంబంధించిన మ్యాప్‌తో కూడిన సరిహద్దులు ఉంటాయని తెలిపారు. అనంతరం పలువురు లబ్దిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యేతో కలిసి మంత్రి ప్రారంభించారు.

**మరో 3,500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి : ఎమ్మెల్యే**

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారని, అందులో 80 శాతం ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, నియోజకవర్గానికి అదనంగా మరో 3500 ఇండ్లు కేటాయించాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. అదేవిధంగా ఆమనగల్‌లో ఆర్డీఓ, ఆర్టీఓ, రిజిస్ట్రేషన్, ఎస్టీఓ తదితర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ సెక్రెటరీ లోకేష్‌కుమార్, జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, విద్యాశాఖ అధికారి సుశీంద రావు, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ ముదిరాజ్, మున్సిపల్ చైర్మెన్ పత్యానాయక్, పీసీబీ సభ్యులు బాలాజీసింగ్, టీపీసీసీ సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ ఫయ్యూమ్ ఖాద్రీ, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధికి కేంద్రం పెద్దపీట

**మొదటిపేజీ తరువాయి**

సంబంధించిన మొదటి విడత నిధులు విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీల కోసం రూ.619.85 కోట్లు విడుదల చేయడాన్ని స్వాగతించారు కేంద్ర మంత్రి. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' మంత్రాన్ని అక్షరాలా ఆచరణలో పెడుతూ ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. కేంద్రం విడుదల చేసిన రూ.619.85 కోట్ల నిధుల్లో రూ.371.91 కోట్లు టైడ్ గ్రాంట్, రూ.247.94 కోట్లు అన్ టైడ్ గ్రాంట్ కింద ఉన్నాయన్నారు. టైడ్ గ్రాంట్ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, వర్షపు నీరు సంరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల పెంపు వంటి అనేక పనులు చేయవచ్చన్నారు. అన్ టైడ్ గ్రాంట్ నిధులను మాత్రం స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభల్లో నిర్ణయం తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకోవచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం.. గ్రామీణ స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులు కేంద్రం నుంచి రాష్ట్రాలకు అందిన వెంటనే ఆయా రాష్ట్రాల ఆర్థిక శాఖలు 10 పని దినాలలోపు సంబంధిత గ్రామ పంచాయతీలకు నిధులను వెంటనే బదిలీ చేయాల్సి ఉంటుంది. అంతకుమించి ఆలస్యం జరిగితే రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పథకాల కోసం తీసుకున్న మార్కెట్ రుణాలు/రాష్ట్ర అభివృద్ధి రుణాల(-ూఆఒ)పై చెల్లిస్తున్న వడ్డీ రేటు ప్రకారం గ్రామ పంచాయతీలకు వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే కేంద్రం విడుదల చేసిన నిధులకు సమానంగా మ్యాచింగ్ గ్రాంట్లు విడుదల చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు.తాజాగా 2025-26కు సంబంధించి రూ.619.85 కోట్లను మొదటి విడత కింద విడుదల చేసింది. ఇక, 16 ఆర్థిక సంఘం కింద 2026-27 నుంచి 2030-31 మధ్య కాలంలో తెలంగాణలోని గ్రామ పంచాయతీలు రూ.9,968 కోట్లను గ్రాంట్ రూపంలో కేంద్రం నుంచి పొందనున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించని కారణంగా.. రెండేళ్ల పాటు (2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన) నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగిన తర్వాత కేంద్రం వాటిని విడుదల చేసింది. తాజాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులనూ కేంద్రం విడుదల చేసింది. గతంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించాయి. అయినప్పటికీ.. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించగానే నిధులను విడుదల చేసింది. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలను రేండెళ్లపాటు నిర్వహించకుండా స్పెషల్ ఆఫీసర్ల పాలనతో రాష్ట్ర ప్రభుత్వం నెట్టుకొచ్చింది. ఇకపైనా ఎప్పటికప్పుడు యుటిలైజేషన్

సర్టిఫికెట్లు సమర్పిస్తే తదనుగుణంగా నిధులను విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అంటూ ప్రకటన జారీ చేశారు.

# హర్మ్యూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం..

**మొదటిపేజీ తరువాయి**

రణధీర్ జైస్వాల్ ధ్రువీకరించారు.

భారత ఇంధన భద్రతకు హర్మ్యూజ్ జలసంధి అత్యంత కీలకం. దేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 40శాతం, ద్రవీకృత సహజ వాయువు (రాచీ+)లో 50శాతం, ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ూా+)లో 80శాతానిపైగా ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది. ఈ నేపథ్యంలో భారత నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఇరాన్‌తో పాటు ఇతర సంబంధిత దేశాలతో చర్చిస్తున్నామని జైస్వాల్ తెలిపారు. ఈ చర్చల ఫలితంగానే గత కొన్ని రోజుల్లో ఆరు భారత నౌకలు సురక్షితంగా జలసంధిని దాటగలిగాయని ఆయన వివరించారు.

ఈ సంక్షోభంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్యంగా స్పందించారు. గతంలో జలసంధిని తెరిపించడం తన ప్రాధాన్యత అని చెప్పిన ఆయన, బుధవారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ప్లేటు ఫిరాయించారు. "మీ చమురు మీరే తెచ్చుకోండి. మీ కోసం మీరు పోరాడటం నేర్చుకోండి. అమెరికా ఇకపై మీకు సహాయం చేయదు" అంటూ యూకే వంటి మిత్రదేశాలకు ఆయన సూచించారు. ఇరాన్‌ను ఇప్పటికే దెబ్బతీశామని, కష్టమైన భాగం పూర్తయిందని ట్రంప్ పేర్కొన్నారు.

మరోవైపు యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గలేదు. ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యూఏఈ సహా 35 దేశాలు సముద్ర భద్రత పునరుద్ధరణకు కలిసి పనిచేయడానికి అంగీకరించాయని ప్రకటించారు. నౌకాయాన స్వేచ్ఛను పునరుద్ధరించడం, చిక్కుకుపోయిన నౌకలు, సిబ్బంది భద్రతను పటిష్టం చేయడం, కీలక సరుకుల రవాణాను తిరిగి ప్రారంభించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. యూకే విదేశాంగ కార్యదర్శి వైవెట్ కూపర్ అధ్యక్షతన జరిగే ఈ భేటీ అనంతరం, తదుపరి కార్యాచరణపై అధికారులు చర్చిస్తారని సమాచారం.

# తెలంగాణలో 2 లక్షల కొత్త పెన్షన్లు.. రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్,ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో కొత్త పెన్షన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శు భవార్త చెప్పింది. చేయూత పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.233 కోట్లను కేటాయించడంతో, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. అయితే, ఇప్పటికే పేరుకుపోయిన లక్షలాది దరఖాస్తుల నుంచి అర్హులను గుర్తించడం అధికారులకు పెను సవాల్‌గా మారనుంది.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో 42.23 లక్షల మంది నెలనెలా చేయూత పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, హెచ్‌ఐవీ, బోదకాలు బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. దివ్యాంగులకు మాత్రం పెన్షన్‌ను రూ.4,016గా ఇస్తున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో 2 లక్షల మంది కొత్తగా చేరనున్నారు. గత మూడేళ్లుగా బోదకాలు, డయాలసిస్ బాధితులకు తప్ప కొత్తగా ఎలాంటి పెన్షన్లు మంజూరు కాకపోవడంతో అర్హులైన వారు తీవ్ర నిరాశలో ఉన్నారు.ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వానికి చేరి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల ప్రకటన వెలువడిన తర్వాత, ఫిబ్రవరి 20 నుంచి ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు, గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభల్లో కూడా భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రభుత్వం ఆమోదించినవి 2 లక్షల పెన్షన్లు కాగా, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 12 లక్షలు దాటింది. వీటిలో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షలు, వితంతు, ఒంటరి మహిళల కోటాలో 3.5 లక్షలు, గీత, చేనేత కార్మికుల విభాగంలో 3 లక్షలు, దివ్యాంగుల పింఛన్‌కు 72 వేల దరఖాస్తులు ఉన్నాయి. ఈ భారీ సంఖ్య నుంచి కేవలం 2 లక్షల మంది అత్యంత అర్హులను ఎంపిక చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు త్వరలోనే పటిష్టమైన వడపోత కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది.

# జ్యుడీషియల్ అధికారుల నిర్బంధంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**మొదటిపేజీ తరువాయి**

నాడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) లేదా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ)తో దర్యాప్తు చేపట్టాలని ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. బెంగాల్‌లో ప్రతి ఒక్కరూ రాజకీయ భాషే మాట్లాడుతున్నారని విచారణ సందర్భంగా భారత ప్రధానన్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్ అసహనం వ్యక్తం చేశారు. 'తప్పు ఎవరు చేస్తున్నారో మాకు తెలియదనుకుంటున్నారా? ఈ ఘటనను తెల్లవారుజామున 2 గంటల వరకు పర్యవేక్షిస్తూనే ఉన్నా. ఇది చాలా దురదష్టకరం' అని ఆయన అన్నారు. ఈ ఘటనపై పలువురు రాష్ట్ర అధికారులకు న్యాయస్థానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. జ్యుడీషియల్ అధికారుల భద్రత కల్పించడంతో పాటు 'సర్' ప్రక్రియకు ఆటంకం కలగకుండా ఉండేందుకు కేంద్ర బలగాలను మోహరించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. అసలేం జరిగిందంటే..ఎస్‌ఐఆర్ పేరుతో పెద్దఎత్తున ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మాల్దా జిల్లాలో బుధవారం ఆందోళనలు జరిగాయి. ఇక్కడ సర్ విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆందోళనకారులు నిర్బంధించారు. సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత అక్కడికి చేరుకొని అధికారులను రక్షించారు. అడ్డుకున్న ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. నిర్బంధానికి గురైన వారిలో ముగ్గురు మహిళా అధికారులు కూడా ఉన్నారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ ఈ విషయంలో తాను చేసేదేమీ లేదని తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిశానిర్దేశంలో కీలుబొమ్మగా నడుస్తున్న ఎన్నికల సంఘమే ప్రస్తుతం రాష్ట్రంలో పాలనా వ్యవహారాలు చూస్తోందని, ఈ ఘటనలకు ఇసిదే బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.

# తెలంగాణకు కిషన్‌రెడ్డి తీరని ద్రోహం

**మొదటిపేజీ తరువాయి**

రాజ్యసభలో కిషన్‌రెడ్డి మాట్లాడటాన్ని ఆక్షేపించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ఆత్మగౌరవాన్ని కిషన్‌రెడ్డి కించపర్చారని విమర్శించారు. కాళేశ్వరం పై రేవంతు చేస్తున్న దుష్ప్రచారాన్ని వల్లెవేస్తూ కిషన్‌రెడ్డి విషం కక్కుతున్నారని పేర్కొన్నారు.2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా..2023 నాటి అది 2.2 కోట్ల ఎకరాలకు పెరిగిందని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా చెప్పింది వాస్తవం కాదా? అని నిలదీశారు. ఆనాడు కాళేశ్వరంపై ప్రశంసలు కురిపించి నేడు రాజకీయ లబ్ది కోసం అబద్దాలు మాట్లాడటమేంటని ప్రశ్నించారు. పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు తాను సిద్ధమనీ, వచ్చే దమ్ము మీకు ఉందా? అని కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ జేబులో నుంచి ఖర్చుపెట్టారా? అని కిషన్‌రెడ్డి అనటాన్ని తప్పుబట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదార్లు, ప్రాజెక్టులకు మీ సొంత పైసలు ఖర్చు పెడుతున్నారా? అని నిలదీశారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలనీ, తెలంగాణకు నిధులు కేటాయించాలని తమ ఎంపీ సురేశ్‌రెడ్డి హుందా ప్రశ్న అడిగితే కిషన్‌రెడ్డి వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డారని విమర్శించారు. 8 మంది బీజేపీ ఎంపీలు, 8 బీజేపీ కాంగ్రెస్ ఎంపీలు తెలంగాణకు ఏం తెచ్చారని ప్రశ్నించారు.

# 2047 నాటికి రాష్ట్రాన్ని నం.1 చేస్తాం: సీఎస్

**మహేశ్వరం ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** 2047-విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ ప్రభుత్వ ప్రగతి పాలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక- 99 రోజుల కార్యక్రమం'లో భాగంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరులో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభకు కలెక్టర్‌తో కలిసి హాజరైన రామకృష్ణారావు.. రాష్ట్ర గీతాన్ని ఆలపించి ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పకడ్బందీగా లబ్ధిదారులకు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా కల్యాణలక్ష్మి చెక్కులు, దివ్యాంగులకు ట్రై స్కూటీలను సీఎస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

# మధ్యప్రాచ్య మంటల్లో అమెరికా-ఇజ్రాయెల్ వ్యూహాలు, ఇరాన్ ప్రతిస్పందన

## ప్రపంచ శాంతికి పెరుగుతున్న ముప్పు..



మధ్యప్రాచ్యం మరోసారి అగ్నిగుండంగా మారుతోంది. ఇజ్రాయెల్ఇరాన్ విభేదాలు, వాటికి అమెరికా మద్దతు, ప్రాంతీయ శక్తి పోటీ, చమురు–వాణిజ్య ప్రయోజనాలు, అణు రాజకీయాలు ఇవన్నీ కలిసిపడి ప్రపంచ శాంతిని మరోసారి ప్రమాదంలోకి నెడుతున్నాయి. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే ఒక స్పష్టమైన నిజం బయటపడుతోంది అమెరికా ప్రపంచ పోలీసు పాత్రను వదలలేకపోతోంది; కానీ యుద్ధాల బరువును పూర్తిగా మోయలేకపోతోంది. అందుకే అది ఇప్పుడు నిజంగానే “కక్కలేకడ మింగలేక” అనే సంకటస్థితిలో నిలిచింది.

ప్రపంచంలో యుద్ధాలు ఒక్కసారిగా మొదలవ్వవు. అవి సంవత్సరాలుగా పేరుకుపోయిన రాజకీయ విభేదాలు, వనరులపై నియంత్రణ పోటీ, సైనిక కూటములు, మత–జాతి విద్వేషాలు, సామ్రాజ్యవాద ప్రయోజనాల ఫలితంగా ఉద్భవిస్తాయి. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ ఒత్తిడి కూడా కొత్తది కాదు. ఇరాన్ అణు కార్యక్రమం, పశ్చిమాసియా రాజకీయాల్లో దాని పెరుగుతున్న ప్రభావం, లెబనాన్, సిరియా, ఇరాక్, యెమెన్ వంటి ప్రాంతాల్లో దాని మిత్ర శక్తుల ఉనికి ఇవన్నీ అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఎప్పటి నుంచో వ్యూహాత్మక సవాళ్లే.

అయితే ప్రశ్న ఏమిటంటే అణు ప్రమాదాన్ని అరికట్టే పేరుతో బాంబుల వర్షం కురిపించడం నిజంగా శాంతికి దారితీస్తుందా? లేక మరింత అస్థిరత, ప్రతీకారం, అంతులేని యుద్ధ చక్రానికే మార్గం వేస్తుందా? చరిత్ర ఇప్పటివరకు ఇచ్చిన సమాధానం స్పష్టమే. యుద్ధం సమస్యలను పరిష్కరించలేదు; అది మరింత మానవ విపత్తును మాత్రమే మిగిల్చింది.

అమెరికా పరిస్థితి ఈ సందర్భంలో అత్యంత సంక్లిష్టంగా మారింది. ఒకవైపు అది ఇజ్రాయెల్‌కు పూర్తి మద్దతు ఇవ్వాల్సిన పరిస్థితిలో ఉంది. మరోవైపు, ఇరాన్‌తో నేరుగా పెద్ద యుద్ధంలోకి దిగితే వచ్చే ప్రమాదాలనూ బాగా అర్థం చేసుకుంటోంది. ఎందుకంటే ఇరాన్ సాధారణ దేశం కాదు. అది కేవలం ఒక దేశం మాత్రమే కాకుండా, మధ్యప్రాచ్యంలో గణనీయమైన రాజకీయ–సైనిక ప్రభావం కలిగిన శక్తి. దాని చుట్టూ అనేక మిత్ర శక్తులు, ప్రతినిధి యుద్ధ బలగాలు, ప్రాంతీయ వ్యూహాత్మక సంబంధాలు ఉన్నాయి.

ఇరాన్‌తో ఘర్షణ పెరిగితే, అది కేవలం రెండు దేశాల మధ్య యుద్ధంగా మిగలదు. ఇరాక్, సిరియా, లెబనాన్, యెమెన్, గల్ఫ్ దేశాలు అన్నీ మళ్లీ అశాంతిలోకి జారిపడే ప్రమాదం ఉంది. అంతేకాదు, ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి ఈ ఘర్షణలో కేంద్రీయ అంశంగా మారుతుంది. ఆ మార్గంలో అంతరాయం కలిగితే ప్రపంచ ఇంధన ధరలు, రవాణా ఖర్చులు, ద్రవ్యోల్బణం, ఆహార ధరలు అన్నీ తీవ్రంగా ప్రభావితం అవుతాయి. అందుకే అమెరికా ఇజ్రాయెల్‌ను పూర్తిగా వదలలేక, ఇరాన్‌తో సంపూర్ణ యుద్ధాన్ని మోయలేక మధ్యలో చిక్కుకుపోయింది.

ఇజ్రాయెల్ తన భద్రతను ప్రధాన కారణంగా చూపుతోంది. ఇరాన్ అణు సామర్థ్యం పెరిగితే అది తనకు అస్తిత్వ ముప్పు అవుతుందని చెబుతోంది. ఈ ఆందోళన పూర్తిగా నిరాధారం కాదు. ఇరాన్ అణు కార్యక్రమంపై అంతర్జాతీయ ఆందోళనలు చాలా కాలంగా ఉన్నాయి. కానీ భద్రతా సమస్యను యుద్ధం ద్వారా పరిష్కరించాలనే దృక్కోణం ప్రమాదకరం. ఒక అణు కేంద్రాన్ని బాంబులతో ధ్వంసం చేస్తే సమస్య పూర్తిగా ముగియదు. భూగర్భ సదుపాయాలు, రహస్య కార్యక్రమాలు, ప్రత్యామ్నాయ సాంకేతిక మార్గాలు కొనసాగుతూనే ఉంటాయి. కొన్నిసార్లు యుద్ధం, అణు ఆయుధాల అవసరం ఉందనే భావనను మరింత బలపరుస్తుంది. అంటే, యుద్ధం అణు ప్రమాదాన్ని తగ్గించకపోగా, దానిని మరింత వేగవంతం చేసే పరిస్థితులను కూడా సృష్టించగలదు.

ప్రపంచ శక్తుల వ్యూహాలు కాగితాలపై గీయబడతాయి. కానీ యుద్ధం బారిన పడేది మాత్రం సాధారణ ప్రజలే. పిల్లలు, మహిళలు, కార్మికులు, విద్యార్థులు, వలస కూలీలు, పాఠశాలలు, ఆసుపత్రులు, నివాస ప్రాంతాలు ఇవే యుద్ధాల అసలు బలి పీఠాలు. ఆధునిక యుద్ధాలు “ఖచ్చితమైన సైనిక లక్ష్యాల” మీదే జరుగుతాయని పాలక వర్గాలు చెబుతుంటాయి. కానీ చరిత్ర చెబుతున్నది వేరే నిజం ప్రతి ఆధునిక యుద్ధం పౌరజీవితానికే అత్యంత భారాన్ని మోపింది.

మధ్యప్రాచ్య యుద్ధాలను కేవలం మత ఘర్షణలుగా చూపించడం కూడా పెద్ద తప్పు. వాటి వెనుక చమురు, వాణిజ్య మార్గాలు, ఆయుధ పరిశ్రమ, ప్రాంతీయ ఆధిపత్యం, జియోపాలిటికల్ నియంత్రణ వంటి అంశాలు బలంగా పనిచేస్తుంటాయి. యుద్ధం వల్ల సాధారణ ప్రజలు నష్టపోతారు; కానీ ఆయుధ కంపెనీలు లాభపడతాయి. బలహీన దేశాలు మరింత బలహీనమవుతాయి; కానీ శక్తివంతమైన దేశాలు “భద్రత” పేరుతో తమ జోక్యాలను పెంచుకుంటాయి. ఈ నేపథ్యంలో యుద్ధం “న్యాయం” కోసం కాదని, “అధికారం ఎవరిది? నియంత్రణ ఎవరిది?” అన్న ప్రశ్నల చుట్టూనే తిరుగుతోందని గుర్తించాలి.

ఈ పరిణామాలు ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థల బలహీనతను కూడా బహిర్గతం చేస్తున్నాయి. ప్రపంచ శాంతి, అంతర్జాతీయ చట్టాలు, సంభాషణల రాజకీయాలు అన్నీ ఉన్నప్పటికీ, శక్తివంతమైన దేశాలు నిర్ణయిస్తే యుద్ధం ఆగడం లేదు. అదే ఈ కాలపు అతిపెద్ద నైతిక సంక్షోభం. శాంతి గురించి బోధించే దేశాలే తమ వ్యూహ ప్రయోజనాల కోసం యుద్ధాలను ప్రోత్సహిస్తే, అది కేవలం రాజకీయ సమస్య కాదు మానవ నాగరికతకే ముప్పు.

భారత్ వంటి దేశాలకు కూడా ఈ పరిణామాలు చాలా ఆందోళనకరమైనవే. ఎందుకంటే భారతదేశానికి అవసరమైన పెద్దమొత్తం చమురు మధ్యప్రాచ్య దేశాల నుంచే వస్తుంది. లక్షలాది భారతీయులు గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్నారు. చమురు ధరలు పెరిగితే దాని ప్రభావం నేరుగా ద్రవ్యోల్బణం, రవాణా, ఎరువులు, విద్యుత్, వ్యవసాయం, నిత్యావసరాల ధరలపై పడుతుంది. అందువల్ల ఇది “వాళ్ల యుద్ధం” మాత్రమే కాదు. ప్రపంచీకరణ యుగంలో ప్రతి యుద్ధం ప్రపంచ ప్రజల జీవితాలపైనే పన్ను వేస్తుంది. ఈ సందర్భంలో జనవిజ్ఞాన వేదిక దృక్కోణం స్పష్టమైనది. యుద్ధం కాదు చర్చలు కావాలి. అణు బెదిరింపులు కాదు నిరాయుధీకరణ కావాలి. ప్రతీకారం కాదు ప్రజల ప్రాణరక్షణ కావాలి. మత విద్వేషం కాదు శాస్త్రీయ దృక్కోణం కావాలి. సామ్రాజ్య జోక్యం కాదు ప్రజాస్వామ్య అంతర్జాతీయ న్యాయం కావాలి. ప్రపంచ శాంతి బలవంతుల దయపై ఆధారపడితే, మానవజాతి భవిష్యత్తు ఎప్పటికీ అస్థిరంగానే ఉంటుంది. అందుకే ఈ కాలంలో శాస్త్రీయ చింతన కలిగిన ప్రజలు, మేధావులు, శాంతి ఉద్యమాలు, ప్రజాస్వామ్య శక్తులు అందరూ కలసి ఒకే స్వరం వినిపించాలి: యుద్ధం ఆపు మానవత్వాన్ని కాపాడు.

**-కె. బి. ధర్మ ప్రకాశ్**
**జనవిజ్ఞాన వేదిక, తెలంగాణ**

## గ్రామ పంచాయతీకి దొమ్మటి రాజేందర్ విరాళం సేవా స్ఫూర్తి చాటిన ఉదాహరణ

**రాయపర్తి/ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ వార్త):**



తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ)లో భాగంగా రాయపర్తి మండలంలోని కొత్తూరు గ్రామ పంచాయతీలో గురువారం విశేష కార్యక్రమం జరిగింది. కీర్తిశేషులు దొమ్మటి నారాయణ జ్ఞాపకార్థం, ఆయన కుమారుడు దొమ్మటి రాజేందర్ తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవలో ముందుకు వచ్చారు. గ్రామ పంచాయతీ అవసరాలకు ఉపయోగపడే సుమారు 25 వేల రూపాయల విలువైన వస్తువులను స్వచ్ఛందంగా అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా రాజేందర్ అందించిన సహకారాన్ని గుర్తిస్తూ అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామ అభివృద్ధికి దోహదపడటమే కాకుండా యువతకు ప్రేరణగా నిలుస్తాయని అధికారులు ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కల్పన, మండల పంచాయతీ అధికారి ప్రకాష్, ప్రత్యేక అధికారి శ్రీనివాస్, సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్, ఉప సర్పంచ్ చిప్ప శ్రీనివాస్, వార్డు సభ్యులు కందికట్ల రేణుక యాకయ్య, చిర్ర నాగరాజు, సుబ్బయ్య, దొమ్మటి లలిత, పంచాయతీ కార్యదర్శి అస్మా, కారోబార్ కందికట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**తల్లాడ/ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా నిరుపేదలకు వారి సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించి అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తల్లాడ మండలంలోని నూతన గ్రామానికి చెందిన పడిగల శ్రీదేవి గారి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకుడు అడపా అనిల్ చౌదరి అనుచరులు పాల్గొన్నారు. ముఖ్యంగా వీరబాబు ముదిరాజ్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాఘమయ్య దయానంద్ ఆదేశాల మేరకు గ్రామ నాయకుల సూచనలతో కార్యక్రమంలో హాజరయ్యారు.

అదేవిధంగా షేక్ సిద్దు, పాషా, ముల్లపాటి లక్ష్మి, అమీర్, రాకేష్, ఉదండు తదితరులు పాల్గొని శ్రీదేవి గారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడంలో నాయకులు కృషి చేయాలని వారు పేర్కొన్నారు.

## గ్రామ సభ నిర్వహణతో అభివృద్ధి దిశగా అడుగులు

**దామచర్ల/ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):**



దామచర్ల మండలంలోని రాళ్లవాగు తండాలో ఈ రోజు గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శంకర్ నాయక్ మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా క్షేత్ర స్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, అందరూ కలిసి పని చేస్తే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక పర్యవేక్షణ అధికారి దినేష్, గ్రామ సెక్రటరీ సుదర్శన్, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వేలేరు గ్రామసభలో పథకాల సమీక్ష

## సమస్యల పరిష్కారానికి చర్యలు





**వేలేరు/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** వేలేరు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బిల్లా యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామసభ స్పెషల్ ఆఫీసర్, వేలేరు మండల తహసీల్దార్ కోమీ, మండల స్పెషల్ ఆఫీసర్ రవీందర్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలపై గ్రామ ప్రజలకు వివరించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, కల్యాణలక్ష్మి, వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు తదితర పథకాల అమలు పురోగతిపై సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య సహకారంతో గ్రామానికి మంజూరైన నిధులు, ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులపై సమగ్ర వివరాలు వెల్లడించారు. భవిష్యత్తులో గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

గ్రామసభలో పాల్గొన్న ప్రజల నుంచి వివిధ సమస్యలు, సూచనలు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు. దాదాపు 650 మంది గ్రామ ప్రజలు ఈ గ్రామసభలో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గ్రామసభ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, విద్యుత్ శాఖ ఏఈ కుమారస్వామి, హెల్త్ డిపార్ట్మెంట్ నవీన్, జీపీ కార్యదర్శి సంపత్ కుమార్, మండల సమైక్య సీసీ, విద్య, గృహనిర్మాణ, వ్యవసాయ, ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, వార్డు సభ్యులు సంధ్య, ప్రవళిక, మౌనిక, పర్వీన్, రణధీర్ రెడ్డి, జావిద్ పాషా, లక్ష్మీనారాయణ, ప్రశాంత్, సురేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# గత 30 ఏళ్ల నిరీక్షణకు తెర

## సత్తుపల్లి 19వ వార్డులో అభివృద్ధి పథం -ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ చొరవతో స్థానికుల హర్షం



**సత్తుపల్లి/ఏప్రిల్ 02 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు ప్రజల దశాబ్దాల కల ఎట్టకేలకు సాకారమైంది. గత 30 సంవత్సరాలుగా అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నీలం తులసమ్మ ఇంటి నుండి వనమా రాజ్యలక్ష్మి ఇంటి వరకు ఉన్న అంతర్గత రహదారిని నూతన సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఈ మార్గం గత మూడు దశాబ్దాలుగా అధ్వానంగా ఉండి, వర్షాకాలంలో చెత్త నీరు నిల్వలు, మురుగు సమస్యలు, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగించేది. ఎన్నో మార్లు ప్రజాప్రతినిధులను ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాలేదు. అయితే స్థానికుల విన్నపాన్ని గౌరవించిన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ప్రత్యేక చొరవ చూపడంతో ఈ ప్రాంతానికి సీసీ రోడ్డు, కొత్త పైప్‌లైన్, డ్రైనేజీ వ్యవస్థ, సోలార్ లైట్ల ఏర్పాటు కోసం నిధులు మంజూరయ్యాయి. అధికారుల పర్యవేక్షణలో పనులు వేగంగా పూర్తయ్యాయి.

**కృతజ్ఞతలు తెలిపిన కాలనీ వాసులు**

30 ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించడంతో వార్డు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

మా ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ గారికి, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహన బేగం గారికి, అలాగే పనులను నిరంతరం పర్యవేక్షించిన వార్డ్ కౌన్సిలర్ కర్నాటి విజయ కుమారి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ అభివృద్ధి పనులతో 19వ వార్డు ప్రజలకు నూతన సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు, ప్రాంతీయ జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# ధర్మసాగర్ మండలంలో గ్రామసభల సమీక్ష

## పథకాల సద్వినియోగంతో గ్రామాభివృద్ధి సాధ్యం: పుష్పరాణి

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని పెద్దపెండ్యాల్, తాటికాయల, రాయగూడెం గ్రామపంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభలను వ్యవసాయ శాఖ స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ పుష్పరాణి విస్తృతంగా పరిశీలించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఈ గ్రామసభల ద్వారా ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచడం, గ్రామ సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలు కనుగొనడం ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.



గ్రామసభలలో మాట్లాడిన పుష్పరాణి, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి అర్హుడూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామస్థులు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నా వాటిని గ్రామసభలోనే వెల్లడించాలని, అధికారులు వెంటనే స్పందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పథకాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, రైతులకు అందుబాటులో ఉన్న సబ్సిడీలు, పంట బీమా, సాగునీటి సౌకర్యాలు వంటి అంశాలను పూర్తిగా వినియోగించుకోవాలని ఆమె కోరారు. గ్రామాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని, ప్రజలుఅధికారులు కలిసి పని చేస్తేనే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఈ గ్రామసభల్లో సర్పంచులు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్థుల అభిప్రాయాలు, సమస్యలు సేకరించి వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలకు నివేదికలు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.

# తల్లాడలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

## ర్యాలీతో నివాళులు- యువతకు స్ఫూర్తి సందేశం

**తల్లాడ/ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** బహుజన రాజ్యాధికార పోరాటయోధుడు, తెలంగాణ గర్వకారణమైన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలను గురువారం తల్లాడలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం సందర్భంగా గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి), గౌడ సంఘం జిల్లా నాయకులు రావుల గోపి గౌడ్ చేతుల మీదుగా ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ సాగి, పాపన్న గౌడ్ స్ఫూర్తిని ప్రతిబింబించే నినాదాలతో కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ సర్దార్ పాపన్న గౌడ్ తెలంగాణ ప్రాంతాన్ని



రక్షించేందుకు రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన మహానుభావుడని గుర్తు చేశారు. సామాన్య ప్రజల హక్కుల కోసం, బహుజనుల రాజ్యాధికార సాధన కోసం ఆయన చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. నేటి యువత ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతే పాపన్న గౌడ్ ఆశయమని, ఆ ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం తల్లాడ మండల అధ్యక్షులు గుండ్ల నాగయ్య, ఉపాధ్యక్షులు గుండ్ల వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా అధ్యక్షులు సమ్మెట రామకృష్ణ, మాజీ సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు, సున్నం హరీష్, మొక్కా నవీన్, మొక్కా తిరుపతిరావు, సత్యనారాయణ, బొడ్డు రామ్ లక్ష్మణ్, బొడ్డు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభల్లో గందరగోళం

## - 6 గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం: బీఆర్ఎస్ నాయకుడు సోయం

**దమ్మపేట/ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం కొమ్ముగూడెం గ్రామంలో నూతన పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ సోయం సత్యవతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు సోయం వీరభద్రం కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజాపాలన పేరుతో గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. కళ్యాణలక్ష్మి తులం బంగారం, రైతు భరోసా, సంవత్సరానికి 6 గ్యాస్ సిలిండర్లు, గృహలక్ష్మి, మహాలక్ష్మి పథకాలు, వృద్ధాప్య మరియు వికలాంగుల పింఛన్ల పెంపు, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల చికిత్స వంటి హామీలు అమలు కాలేదని ఎద్దేవా చేశారు. మొత్తం 420 వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. గ్రామ సభలకు





అధికారులు పూర్తి స్థాయిలో హాజరుకాకపోవడం వల్ల ప్రజల సమస్యలకు సమాధానాలు దొరకడం లేదని, బాధ్యతారాహిత్యంతో సమావేశాలు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని సోయం పేర్కొన్నారు. ప్రజల ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పే విధంగా వ్యవస్థ ఉండాలని డిమాండ్ చేశారు. గ్రామ సభకు హాజరైన నోడల్ అధికారి వెంటనే గ్రామంలో ఉన్న సమస్యలపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి పెద్దపీట వేసిందని, సీసీ రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, క్రీడా స్థలాలు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, పరిశుభ్రత కోసం ట్రాక్టర్లు, నీటి ట్యాంకులు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరోగ్యకర జీవనశైలి పర్యావరణ హిత వినియోగంపై వర్క్‌షాప్

**నర్సంపేట/ఏప్రిల్ 2 (జర్నలిస్టు వార్త):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో ఏకో క్లబ్ ఆధ్వర్యంలో, తెలంగాణ పర్యావరణ పరిరక్షణ సంస్థ అనుబంధంగా, తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ సౌజన్యంతో విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేక అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో మిల్లెట్స్ వినియోగం, ఫ్రూట్ సలాడ్ ఆరోగ్య ప్రయోజనాలు, ప్లాస్టిక్ నిషేధం, జూట్ బ్యాగుల తయారీ, పేపర్ వినియోగ ప్రాధాన్యత వంటి అంశాలపై విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లన్న నవీన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరచుకోవడంతో పాటు ప్రకృతికి మేలు చేసే జీవనశైలిని అనుసరించాలని సూచించారు. మిల్లెట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, ప్లాస్టిక్ వినియోగం ప్రకృతికి హానికరమని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ఒకరోజు కార్యక్రమం కాదని, ప్రతిరోజూ పాటించాల్సిన జీవన విధానమని పేర్కొన్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా జూట్ బ్యాగులు, పేపర్ ఉత్పత్తులు వాడాలని సూచించారు. అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కందాల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పర్యావరణ అవగాహన ఎంతో అవసరమని తెలిపారు. ఏకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ ఎం. రాంబాబు మాట్లాడుతూ మిల్లెట్స్, సహజ ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్పరిణామాలు, జూట్ బ్యాగుల తయారీ విధానం వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినేషన్ కంట్రోలర్ ఎస్. కమలాకర్, స్టాఫ్ సెక్రటరీ రహీముద్దీన్, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# గ్రామపంచాయతీలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ



**తల్లాడ/ ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం కొత్త వెంకటగిరి గ్రామపంచాయతీలో ఈ రోజు ఉదయం 10 గంటలకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర గేయం "జయహో జై తెలంగాణ"తో ప్రారంభమై, అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు మరియు గ్రామాభివృద్ధి పనులపై గ్రామసభలో వివరించారు. గ్రామంలో ప్రజా సమస్యలను స్వీకరించేందుకు ప్రత్యేక బాక్స్‌ను ఏర్పాటు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా జాబితాలను ఎటువంటి పక్షపాతం లేకుండా రూపొందించాలని నిర్ణయించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రగతి దిశగా సాగాలంటే ప్రభుత్వం అందిస్తున్న నిధులను అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని, దుర్వినియోగానికి తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే నియమ నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ ప్రవర్తించకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్‌గా తల్లాడ ఏపీఎం రవికుమార్, సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ రుద్రాక్ష వెంకటాచారి, గ్రామ కార్యదర్శి ఎస్‌కే మీరా, గ్రామ పెద్దలు దిరిశాల వెంకట నరసయ్య, దిరిశాల వెంకట్రామయ్య, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# హసన్పర్తిలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభల ప్రకటన పత్రం విడుదల



**హసన్పర్తి/ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభల ప్రకటన పత్రాన్ని హసన్పర్తి మండలంలో ఘనంగా విడుదల చేశారు. వరంగల్‌లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్, పోచమ్మ మైదానంలో ఏప్రిల్ 17, 18 తేదీలలో నిర్వహించనున్న మహాసభల నేపథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని హసన్పర్తి మండల ఉపాధ్యక్షులు బొడిగె కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హనుమకొండ జిల్లా అధ్యక్షులు రాజారపు రత్నం హాజరై మాట్లాడుతూ దళితుల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం ఈ సంఘం నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడానికి హనుమకొండ జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి దళితులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలు దళితుల సమస్యలపై చర్చించి, వారి హక్కుల సాధన దిశగా కీలక నిర్ణయాలు తీసుకునే వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రొంటాల దేవా, రాజారపు శ్రీనివాస్, మేకల పవన్, అఖిల్, అశోక్, సమ్మయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్‌లో గ్రామసభ

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: సర్పంచ్ మాచర్ల జ్యోతి





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల జ్యోతి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం గ్రామసభల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధికి సంబంధించి తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా వెల్లడించాలని, వాటిని దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ గ్రామసభలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ం

# నకిలీ బంగారం తాకట్టు

## -9 లక్షల రుణం మోసం , ముగ్గురు అరెస్ట్



**కల్లూరు/ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** కల్లూరు డివిజన్ పరిధిలోని ఏన్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తెలంగాణ గ్రామీణ బ్యాంకులో నకిలీ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రూ.9 లక్షలకు పైగా రుణాలు పొందిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ వెల్లడించారు. బ్యాంకు శాఖా నిర్వాహకుడు కె.వి. ప్రశాంత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, 2024 సంవత్సరంలో జరిగిన ఈ మోసాన్ని బట్టబయలు చేశారు. విచారణలో గోల్డ్ అప్రైజర్‌గా పనిచేసిన శ్రీపాది సతీష్ (ఏ1), శ్రీపాది మౌనిక (ఏ2 పరారీ), రామచంద్రోజు జయమ్మ (ఏ3), రామచంద్రోజు నరేష్ (ఏ4)లు కలిసి సుమారు 242.25 గ్రాముల నకిలీ బంగారు ఆభరణాలను అసలైనవిగా చూపించి రూ.9,53,000 రుణాలు పొందినట్లు పోలీసులు తెలిపారు. తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో ఆ ఖాతాలు ఎన్‌పీఏలుగా మారాయి. అనంతరం బ్యాంకు అధికారులు వేలం ప్రక్రియ ప్రారంభించగా, తాకట్టు పెట్టిన ఆభరణాలు నకిలీవని గుర్తించారు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ మేరకు శ్రీపాది సతీష్, రామచంద్రోజు జయమ్మ, రామచంద్రోజు నరేష్‌లను అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. మరో నిందితురాలు శ్రీపాది మౌనిక పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఇలాంటి మోసపూరిత చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు.

# మానసిక దివ్యాంగులకు అన్నదానం



**మధిర/ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** మధిర మండలంలోని సిద్దినేనిగూడెం (మర్లపాడు) గ్రామానికి చెందిన పులిబండ్ల నాగేంద్రమ్మ వర్ధంతి సందర్భంగా మానవతా కార్యక్రమంగా అన్నదానం నిర్వహించారు. నాగేంద్రమ్మ మనమరాలు, ఎన్ఆర్ఐ పిళ్ళా పూజితా నాయుడు, జగదీష్ దంపతుల ఆర్థిక సహకారంతో మధిరలోని మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో భోజన వితరణ చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు దేవుడు ధైర్యం ఇవ్వాలని మానసిక దివ్యాంగ పిల్లలు ప్రార్థించారు. వృద్ధురాలి జ్ఞాపకార్థం ఇలాంటి సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అక్కడి నిర్వాహకులు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పులిబండ్ల నాగేంద్రమ్మ కుమారుడు పులిబండ్ల శ్రీనివాసరావు, చంద్రు శ్రీధర్ రావు, ఏడుకొండల అప్పారావు, దూదేకుల ఖాసీం సాహెబ్, అట్లూరి సాంబి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాగేంద్రమ్మ వర్ధంతి సందర్భంగా మానసిక దివ్యాంగ పిల్లలకు అన్నదానం చేసిన పూజితా నాయుడు, జగదీష్ దంపతులకు కేంద్రం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# మానవాళి పాపాల కోసం

## నేడే గడ్‌ఫ్రైడే

## సిలువపై ప్రాణాలు అర్పించిన జీసస్




**సమస్త మానవాళి చేసిన పాపాల కోసం ఆయన సిలువపై ప్రాణాలు అర్పించారు. తిరిగి మూడో రోజు సమాధి నుంచి లేచాడు. పొరుగువారిని ప్రేమించాలని వారి తప్పులను క్షమించాలంటూ తాను భూమిపై జీవించిన రోజుల్లో బోధనలు చేశారు. ఆయనే జీసస్. క్రైస్తవ మత విశ్వాసం ప్రకారం యేసుక్రీస్తు శుక్రవారం సిలువ వేయబడ్డాడు. యేసు క్రీస్తు మరణిస్తే శుభ శుక్రవారం లేదా గుడ్ ఫ్రైడే అని ఎందుకు పిలుస్తున్నాము ..? అసలు శుభం ఎలా అవుతుంది..?**

గుడ్ ఫ్రైడే ... శుభశుక్రవారం. చాలామంది తెలియని వారు గుడ్ ఫ్రైడే అంటే ఏదో పండగలా భావిస్తారు. ఇందుకు కారణం ఆ పదంలో గుడ్ అంటే శుభం అని ఉండటమే. వాస్తవానికి గుడ్ ఫ్రైడ్ అంటే క్రైస్తవుల ప్రకారం మానవాళి చేసిన పాపాల కోసం తన ప్రాణాలను జీసస్ సిలువపై పణంగా పెట్టాడని చెబుతారు. జీసస్‌ను సిలువపై వ్రేలాడదీసిన రోజును పవిత్ర శుక్రవారం, లేదా బ్లాక్ ఫ్రైడే అని కూడా పిలుస్తారు. యేసు ప్రభువు చనిపోయిన రోజును గుడ్ ఫ్రైడేగా పిలుస్తారు. ఈ రోజున క్రైస్తవులు ఉపవాసం ఉండి దేవున్ని తలచుకుంటారు. ప్రార్థనలో గడుపుతారు.

**వివిధ దేశాల్లో గుడ్ ఫ్రైడేకు పలు రకాల వివరణలు**

ఇదిలా ఉంటే గుడ్ ఫ్రైడే పేరు ఎక్కడి నుంచి వచ్చిందో ఎవరికీ తెలియదు. అయితే గుడ్ ఫ్రైడే అనే ఈ పేరు ఎలా వచ్చిందో అనేదానికి పలువురు పలు రకాలుగా వారి వాదనలు వినిపిస్తున్నారు. శుభ శుక్రవారంలో ఏదో మంచి ఉందని చాలా మంది భావిస్తారు. యేసు ప్రభువు సమస్త మానవాళి చేసిన పాపాలకు తన ప్రాణాలు అర్పించి పునరుత్థానం చెందాడని చెబుతారు. మరికొందరు గుడ్ అనే పదం ఇంగ్లీషులో ఏమైతే అర్థం ఇస్తుందో దాని ప్రకారంగానే హోలీ ఫ్రైడే అని పిలుస్తారని చెప్తారు. లెంట్ కాలంలోనే గుడ్ ఫ్రైడే వస్తుంది. ఈ సమయంలో క్రైస్తవులు మాంసాహారం తీసుకోరు. గుడ్ ఫ్రైడే రోజున ఒక



సారి పూర్తి స్థాయి భోజనం మరో రెండు పూట్ల ఫలహారం తీసుకుంటారు.

**పొరుగువారిని ప్రేమించి వారిని క్షమించాలి:**

యేసుప్రభువు ప్రపంచ వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే రోజున ఒకొక్కరూ ఒక్కొక్క పద్ధతిని పాటిస్తారు. కొందరు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపి ప్రార్థనను ముగించేందుకు సూచనగా 33 సార్లు చర్చి గంటను మోగిస్తారు. క్రిస్మస్ వేడుకల కంటే చాలా ప్రాచీనమైనది గుడ్‌ఫ్రైడే. క్రైస్తవుల పవిత్ర గ్రంథం బైబిల్ కూడా జీసస్ పుట్టుక గురించి ఆయన పుట్టిన తేదీ గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. కానీ ప్రభువును శిలువ వేయడాన్ని గురించి ప్రస్తావించింది. యూదా ఇస్కరియోత్ అనే యేసు ప్రభువు శిష్యుడు కేవలం 33 వెండి నాణేల కోసం యేసు ప్రభువుకు నమ్మక ద్రోహం చేస్తాడు. క్రీస్తు ఎక్కడున్నాడో సైన్యానికి చెప్పేస్తాడు. ఆ తర్వాత క్రీస్తును తీసుకురావడం ఆయన్ను సిలువ వేయడం సిలువపై వ్రేలాడి ఉండగా ప్రభువు చివరిగా మాట్లాడే ఏడు మాటలను క్రైస్తవులు ఈ రోజు గుర్తు తెచ్చుకుని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. క్రీస్తు యేసు తాను భూమిపై బతికున్న రోజుల్లో ఎన్నో బోధనలు చేశారు. అందులో ముఖ్యమైనది తమ పొరుగువారిని ప్రేమించి వారి తప్పులను క్షమించాలని చెప్తారు. దీన్నే క్రైస్తవులు అనుసరిస్తారు.

## చెన్నారావుపేట గ్రామసభలో 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమం ఘనంగా





**నర్సంపేట/ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట నియోజకవర్గంలో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని చెన్నారావుపేట గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి అధ్యక్షతన గ్రామసభగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించారు. గ్రామంలోని సమస్యలు, అవసరాలు, అభివృద్ధి పనులపై ప్రజల అభిప్రాయాలను సేకరించి, ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని నిర్ణయించారు. సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన ప్రజా పాలనను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, నర్సంపేట శాసనసభ సభ్యులు దొంతి మాధవ రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అందుకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఇందిరమ్మ పాలనలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలు నిరంతరంగా అమలవుతూ ప్రజలకు చేరుతున్నాయని వివరించారు. అదేవిధంగా గ్రామసభలో వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాను ప్రజల ముందుంచి పారదర్శకంగా ప్రదర్శించి, అభ్యంతరాలు మరియు సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఎం. బాలకృష్ణ, ఎంఆర్ఓ ఎం.డి. అబీద్ అలీ, పిహెచ్‌సీ వైద్య అధికారి సరోజ, విద్యుత్ శాఖ ఏఈ వి. సంపత్, గ్రామపంచాయతీ కార్యదర్శి బత్తుల నర్సయ్య, ఉపసర్పంచ్ దొంతి శ్రీనివాస్, వార్డు సభ్యులు, అధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కొత్తకొండ ఆలయాన్ని సందర్శించిన ఉప కమిషనర్ రామాల సునీత





**భీమదేవరపల్లి/ఏప్రిల్2 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని ప్రసిద్ధ శ్రీ వీరభద్రస్వామి ఆలయాన్ని గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ ఉప కమిషనర్ మరియు వరంగల్ జిల్లా సహాయ కమిషనర్ రామాల సునీత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం అందించారు. ఆలయ పరంపరలు, నిర్వహణ, అభివృద్ధి అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు రాంబాబు, శ్రీకాంత్, అర్చకులు వినయ్, సందీప్, శివకుమార్, వీరభద్రయ్య, శశాంక్, సిబ్బంది రవీందర్, నారాయణరావు, శ్రీధర్, అనూష తదితరులు పాల్గొన్నారు.

## చంటయ్యపల్లిలో పాడి పశువులకు టీకాలు



**భీమదేవరపల్లి/ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలం చంటయ్యపల్లి గ్రామంలో పాడి పశువులకు జాతీయ గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ భూక్య సునీత మణికంఠ అధ్యక్షత వహించగా, ఉప సర్పంచ్ ముప్పు సాయి చంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశువైద్య సిబ్బంది గ్రామంలోని పాడి పశువులకు టీకాలు వేయడంతో పాటు రైతులకు గాలి కుంటు వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. పశువుల ఆరోగ్యం కాపాడుకోవడం ద్వారా రైతులు ఆర్థిక నష్టాలను నివారించవచ్చని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ పశువులకు టీకాలు వేయించుకున్నారు.

# చికెన్ బంద్‌తో దిగివచ్చిన పౌల్ట్రీలు

## డిమాండ్లు అంగీకరించినట్లు ట్రేడర్స్ వెల్లడి

**వరంగల్,ఏప్రిల్ 2 (జర్నలిస్ట్ వార్త):** చికెన్ సెంటర్ల బంద్ విజయవంతమైంది. బంద్ దెబ్బకు పౌల్ట్రీకంపెనీలు దిగివచ్చాయి. బర్డ్ ధరను రూ.185 నుంచి రూ.125కి తగ్గించాయి. చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఇచ్చే మార్జిన్‌ను గతంలో మాదిరిగానే కిలోకు రూ.15, ఆ పైన మార్జిన్ ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. దీనితో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చికెన్ సెంటర్ల నిర్వా హకులు బంద్‌ను విరమించుకోవాలని నిర్ణయించు కున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా బ్రాయిలర్ ట్రేడర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు. బంద్ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. బంద్‌ను విజయవంతం చేసినందుకు చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఒక్కరోజు చికెన్ సెంటర్ల బంద్‌తో నాటు కోళ్లకు డిమాండ్ పెరిగింది. బ్రాయిలర్ కోళ్ల అమ్మకాలు లేకపోవడంతో మాంసం ప్రియులు నాటు కోళ్లను ఎక్కువగా కొనుగోలు చేసారు. దీంతో వీరు కూడా ధరలు పెంచి అమ్మారు. నాటు కోడి రేటు ఎక్కువగా ఉంటుంది కనుక సాధారణ రోజుల్లో వీటి అమ్మకాలు తక్కువగా ఉంటాయి. నాటు కోళ్లను ఇష్టపడేవారు మాత్రమే వీటిని కొనుగోలు చేస్తారు. బంద్‌తో నాటు కోళ్ల పెంపకం దారులు వీటిని



మార్కెట్‌కు తరలించారు. సాధారణ ధరకన్నా కాస్త ఎక్కువైనా కొనుగోలు చేశారు. చికెన్ సెంటర్ల బంద్‌తో మాంసం విక్రయాలు కూడా 20 నుంచి 25 శాతం పెరిగినట్టు మాంసం విక్రయదారులు తెలిపారు. బుధవారం నుంచి చికెన్ సెంటర్ల బంద్ జరుగుతున్న దృష్ట్యా ముందే మేల్కొన్న మాంసం విక్రయదారులు కాస్త ఎక్కువగానే జీవాలను కోసి ఉదయం నుంచే సిద్ధంగా ఉంచారు. చికెన్ అమ్మకాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా మాంసం కొనుగోలు చేయడానికి ఎక్కువ మంది మొగ్గు చూపారు. చికెన్ సెంటర్ల బంద్‌లో భాగంగా బుధవారం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద జరిగిన మహా ధర్నాలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి చికెన్ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు. తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని నినాదాలు చేశారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసు కోవాలని, విధాన పరంగా చికెన్ ధరలు, కమిషన్ మార్జిన్ ధరలు నిర్ణయించాలని, చిల్లర చికెన్ వ్యాపారులు లేకుండా చేయాలని పౌల్ట్రీ కంపెనీలు చేస్తున్న కుట్రను అడ్డుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు.

## ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధి సాధ్యం

### సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ మాట్ల హరికుమార్






**భీమదేవరపల్లి/ఏప్రిల్2 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్ల హరికుమార్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం అత్యంత కీలకమని తెలిపారు. గ్రామసభ స్పెషల్ ఆఫీసర్ స్వరూప రాణి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు తీరు, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతి నివేదికలను వివరించారు. ప్రజలకు అందుతున్న సేవలపై కూడా ఆమె అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి శరత్ గ్రామ అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర వివరాలు అందించారు. వివిధ రంగాలలో చేపట్టిన పనులు, భవిష్యత్ కార్యాచరణపై వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామ అభివృద్ధి పై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.